జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | సోమవారం 18 మే 2026 | సంపుటి : 16 | సంచిక : 293 | పేజీలు : 8 వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారిన

# కూకట్ పల్లి డివిజన్

### అనుమతులకు మించి అంతస్తులు...!

### ముడుపులు ఇస్తేనే సక్రమం....ఈయకపోతే అక్రమం..!

### ప్రభుత్వం ఇచ్చే జీతం కన్నా.... సొంత ఆదాయంపైనే మక్కువ..!



**కూకట్ పల్లి, మే 17 (ప్రజా జ్యోతి) :**

కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్ లో అక్రమ భవన నిర్మాణాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. దేవినగర్ లో భవన నిర్మాణదారులు అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు వేసి ఇలాంటి సెట్ బ్యాక్ వదలకుండా నిర్మిస్తున్నప్పటికీ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ కూకట్ పల్లి పలు ప్రాంతాలలో కూడా అనుమతులు లేని ఐదు అంతస్తులతో కూడిన భవనాలు, ఆపై కమర్షియల్ నిర్మిస్తున్న కూడ అధికారులు చోద్యం చూడటంలో మర్మమేమిటనేది తెలియడం లేదు. ఇలాంటి అక్రమ భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే భవన యాజమానులకు సహకరిస్తున్నారని అక్రమ అంతస్తుకి లక్ష కి పైనే వసూలు చేస్తున్నారని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అని తెలుస్తుంది.

జిహెచ్ఎంసి చైన్ మాన్ లతో భారీగా ముడుపులు ముట్ట చెప్పుకుంటున్నారని స్థానిక ప్రజలు చెవులు కోరుకుంటున్నారు. ప్రజలు ఆన్లైన్ ట్విట్టర్ ద్వారా అధికారులకు పిర్యాదు చేసిన స్పందించకపోవడంతో నోటీసులు జారీ చేస్తామంటూ ట్విట్టర్ ద్వారా ప్రలోభాలు పలుకుతూ చేతులు దులుపుకుంటున్నారు.

చైన్ మెన్, అవుట్ సోర్స్ లే బ్రోకర్లు అంటున్న స్థానికులు

మున్సిపల్ కార్యాలయంలో ఒక్కో ఎరియాకు ఒక్కో చైన్ మెన్, అవుట్ సోర్స్ లని నియమించి అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నటు వంటి భవనాలు, కట్టడాల గురించి అధికారులకు చేరవేసేలా చూడాలి కాని భవన యాజమానులు మచ్చిక చేసుకుంటే చాలు ఆ అక్రమ భవనాల వైపు కనీసం మచ్చుకైన దరి చేరకుండా ఉండటం సదరు చైన్ మెన్ కు అలవాటుగా మారిందని అదే అదనుగా ఇష్టానుసారం అనుమతులు లేని భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ కట్టడాల గురించి ఎన్ని సార్లు అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతొ అక్రమ భవనాలు నిర్మిస్తున్న యజమానులు ముందుగానే అధికారులకు చేతులు తడిపినట్టుగా ప్రజలు భావిస్తున్నారు.

ట్విట్టర్ ఫిర్యాదులను అటక ఎక్కిస్తున్న వైనం

కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అక్రమ భవనాల గురించి జిహెచ్ఎంసి సమస్యల పరిష్కారం కొసం ఏర్పాటు చేసిన ట్విట్టర్ లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు చేసిన వారు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ట్విట్టర్ లో ఫిర్యాదులు స్వీకరించాల్సిన జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్,సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోగా నెలల తరబడి ఆ ఫిర్యాధులను సాగదీయడమో కాకా సమస్య పరిష్కారం అయినట్టుగా అట్టీ ఫిర్యాదుకు పరిష్కారం చూపినట్టుగా చెప్పి క్లోస్ చేయడం ఎన్నో మార్లు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా సర్కిల్ మున్సిపల్ పరిధిలో ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు మాత్రం అనుమతులు లేని భవనాలకు అడ్డుకట్ట వేయకపోతే మాత్రం భవిష్యత్ లో తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలి

**రాజేంద్రనగర్, మే 17 (ప్రజా జ్యోతి)**

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలని మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్,శంషాబాద్ మాజీ జెడ్పిటీసీ బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ మండలం నర్కుడకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు గూడెం రాజేందర్ బృందం బలవంతరావు, గూడెపు గోపాల్, గూడెపు రవి కిరణ్, గూడెపు కళ్యాణ్, సంపత్ లు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి కార్తిక్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని, రానున్న రోజుల్లో ఈ ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ పార్టీ గెలిపి లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క ఆమీని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు గ్రామ గ్రామాన్ని తీసుకెళ్లి



ప్రజలను వివరించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తలెత్తుతున్న సమస్యలపై ప్రజల పక్షాన ఉండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా మోయి సుజాత నియామకం

### అల్వాల్ బీజేపీ నాయకురాలికి కీలక బాధ్యతలు

**అల్వాల్ మే 17 (ప్రజా జ్యోతి)**

అల్వాల్ ప్రాంతానికి చెందిన ప్రముఖ బీజేపీ నాయకురాలు మోయి సుజాతకు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చాలో కీలక పదవి దక్కింది. ఆమెను రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ నియామకంతో అల్వాల్ ప్రాంత బీజేపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న మోయి సుజాతకు ఈ బాధ్యతలు రావడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా సాధికారత, బీసీ వర్గాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చురుకైన పాత్ర పోషిస్తున్నారని



నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా మోయి సుజాత మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు బీజేపీ సీనియర్ నాయకుడు, ఎంపీ ఈటల రాజేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా మరింత కృషి చేస్తానని, ముఖ్యంగా ఓబీసీ వర్గాల హక్కులు, సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. మోయి సుజాత నియామకం బీజేపీకి అల్వాల్ ప్రాంతంలో మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## శంషాబాద్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పని చేయాలి

### శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్ రెడ్డి

### శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ పూర్తి కమిటీని ప్రకటించిన కొలన్ ప్రదీప్ రెడ్డి



**రాజేంద్రనగర్, మే 17 (ప్రజా జ్యోతి)**

శంషాబాద్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పని చేయాలని శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్ రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం శంషాబాద్ జిహెచ్ఎంసి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ ప్రదీప్ రెడ్డి పూర్తి స్థాయి డివిజన్ కమిటీని ప్రకటించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా జనార్దన్ యాదవ్,గాజుల రాహుల్ అప్ప, ఉపాధ్యక్షులుగా బాత్కు మహేష్ యాదవ్, వెంకటేష్ ముదిరాజ్, కుమ్మరి అర్జున్, జాయింట్ సెక్రటరీలుగా వేణు గౌడ్, పరమేష్ యాదవ్, బాలరాజు లను నియమించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో కలిసి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తిక్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శంషాబాద్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీని మరింత బలపరిచి డిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి చైతన్యం చేయాలన్నారు. డివిజన్ లో ప్రజలకు తలెత్తుతున్న సమస్యలపై ప్రజల తరఫున ఉండి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తప్పించాలి

**– డా. మెతుకు ఆనంద్ డిమాండ్**



**వికారాబాద్ ప్రతినిధి, మే 17(ప్రజా జ్యోతి):** బాధితురాలికి న్యాయం జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డా. మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. ఆయన పదవిలో కొనసాగితే విచారణ నిష్పక్షపాతంగా జరిగే అవకాశాలు తగ్గుతాయని అన్నారు. ఈ కేసులో నిందితుడు బండి భగీరథను అరెస్ట్ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనితీరు ప్రశ్నార్థకమైందని విమర్శించారు. భగీరథ ఎక్కడున్నాడో బండి సంజయ్‌కు ముందే తెలిసి ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. తొమ్మిది రోజుల తర్వాత నిందితుడిని పోలీసులకు అప్పగించడం నైతికంగా సరైంది కాదని, ప్రజా ఒత్తిడి కారణంగానే ఈ చర్య తీసుకున్నారని ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు స్వీకరణలో కూడా ఆలస్యం జరగడం తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. మీడియా నిజాలను వెలుగులోకి తేవడంలో విఫలమైందని, సోషల్ మీడియా మాత్రం న్యాయం కోసం తోడ్పడిందని పేర్కొన్నారు. కాబట్టి బండి సంజయ్ స్వచ్ఛందంగా రాజీనామా చేయాలి లేదా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## పెట్రోల్--డీజిల్ ధరల పెంపుతో పేదలపై భారం

**– డా. మెతుకు ఆనంద్**




**వికారాబాద్ ప్రతినిధి, మే 17(ప్రజా జ్యోతి):** ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు ధరలు పెంచబోమని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ నిర్ణయం సామాన్య ప్రజలపై భారంగా మారుతుందని డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉండటంతో, పేద, మధ్యతరగతి ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతన లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు.
అదేవిధంగా, పెరిగిన ఇంధన ధరల ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి, జీవన వ్యయం అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజలు వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ మార్గాల వైపు మొగ్గు చూపాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడంతో పాటు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను కూడా తగ్గించి ప్రజలకు ఊరటనివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## యువజన వారోత్సవాలు

**కేశంపేట మే 17 (ప్రజా జ్యోతి):**ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 18 తారీకు సోమవారం యువజన వారోత్సవాల్లో భాగంగా కేశంపేట మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఉదయం 7 గంటల వరకు ఆసక్తి గల యువకులు ఒక కిలోమీటర్ రన్నింగ్ రెండు కిలోమీటర్ల రన్నింగ్ కు హాజరు కావలసిందిగా ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి కోరారు

## కాలనీల అభివృద్ధికై కృషి చేస్తా బస్తీబాట కార్యక్రమంలో బి కే ఆర్




**కుత్బుల్లాపూర్ మే 17(ప్రజా జ్యోతి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో లిమార్నింగ్ వాక్ బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీని సందర్శించిన రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి కాలనీ అధ్యక్షులు కాలనీ ప్రజలతో కలిసి గ్రీనీస్ కాలనీ లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ రోడ్లను పరిశీలించడం నేరుగా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు వారు మాట్లాడుతూ కాలనీలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి డ్రైనేజీలు రోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యల పరిష్కారానికై ఖచ్చితంగా కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది ప్రతిరోజు బస్తీ బాట కార్యక్రమంతో బహదూర్ పల్లి డివిజన్ లోని ఉన్న ప్రతి ఒక్క కాలనీలను సందర్శించి నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఆర్ సాధు యాదవ్ వేణు కుమార్ ప్రవీణ్ ముదిరాజ్ ,కాలనీ అధ్యక్షులు అమర్ పటేల్ దామోదర్ రాజిరెడ్డి రాజశేఖర్ వీరన్న బీరప్ప చంద్రయ్య శ్రీనివాస్ కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలు పాల్గొనడం జరిగింది

## ఈఏపిసెట్ ఫలితాల్లో త్రివిద్య కళాశాల విద్యార్థులు ప్రభంజనం

**– జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లోనూ మా విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారు**

**– కళాశాల చైర్మన్ పి. శ్రీధర్ కుమార్ రెడ్డి**



**మేడ్చల్, మే 17 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఈఏపి సెట్ ఫలితాల్లో త్రివిద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించడం పట్ల కళాశాల చైర్మన్ పి.శ్రీధర్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వెలువడిన ఈఏపి సెట్ ఫలితాల్లో త్రివిద్య జూనియర్ కళాశాల విద్యార్థులైన కె.హర్షిత్ రెడ్డికి 30వ ర్యాంకు, ఎం. ఎన్ ప్రద్యుమ్న రెడ్డికి 115వ ర్యాంకు, పి. శ్రీవిద్యకు 147వ ర్యాంకులు రాగా మరో 37 విద్యార్థులలు 500 లోపు ర్యాంకులు అలాగే 94 మంది విద్యార్థులు వెయ్యి లోపు ఉత్తమ ర్యాంకులు రాబట్టడం గర్వకారణమని కళాశాల యాజమాన్యం పత్రిక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. ఇదే విషయంపై కళాశాల చైర్మన్ శ్రీధర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులకు ఈఏపి సెట్ ఫలితాల్లో అత్యుత్తమ రాయంకులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచేలా బోధించిన సిబ్బందిని ఆయన ప్రశంసించారు. ఉత్తమ ర్యాంకులు కనబరిచిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను చైర్మన్ పి.శ్రీధర్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. విద్యార్థుల కఠోర శ్రమ అలాగే వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంతోటే ఇంతటి ఉత్తమ ర్యాంకులు ఫలితాల్లో వెలువడ్డాయని అన్నారు. ఇది తరహాలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మరింత పట్టుదలతో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.

# శ్రీ చెన్నకేశవ స్వామికి పూజలు నిర్వహించిన గ్రామస్థులు

**– ఆలయ పునర్నిర్మాణం చేయాలని ప్రజల డిమాండ్**

**– గ్రామ ప్రజల విశ్వాసాలను కాపాడాలని ఉక్కుల అశోక్ విజ్ఞప్తి**

**ఇబ్రహీంపట్నం మే 17 ప్రజాజ్యోతి:** జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని చింతపల్లి గూడ గ్రామంలోని ప్రగతి వెంచర్‌లో ఉన్న పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని గ్రామ ప్రజలు అత్యంత పవిత్రమైన దేవస్థానంగా భావిస్తూ తరతరాలుగా పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ఈ దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. ఇటీవల ఆలయం కూల్చివేత ఘటనపై గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆలయ ప్రాంగణానికి చేరుకుని శ్రీ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.
ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, "మా గ్రామ దైవంగా భావించే చెన్నకేశవ స్వామి ఆలయాన్ని తిరిగి నిర్మించాలి. వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని కాపాడటం అందరి బాధ్యత" అని పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు సమాజంలో విభేదాలకు దారితీస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... గ్రామ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జోగు శేఖర్, ఉడుతల రవి



గౌడ్, జోగు సంజీవ, కొంద్రు రాములు, జోగు పోచయ్య, జోగు స్వామి, జోగు రాములు, జోగు పెంటయ్య, జోగు ముత్తయ్య, జోగు మహేందర్, చెరుకూరి గిరి తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలపై దిల్‌కుష్ నగర్ లో బండి రమేష్ పాదయాత్ర

**కూకట్ పల్లి, మే 17 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో గల దిల్ కుష్ నగర్ లో ప్రజా సమస్యలపై టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆదివారం విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. కాలనీవాసులు తమ సమస్యలను రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గతంలో తాము ఐడిపిఎల్ స్థలం రహదారి నుంచి రాకపోకలు సాగించేవారమని అయితే ఇటీవల ఈ రహదారికి అడ్డంగా ఫెన్సింగ్ చేశారని దీంతో తమకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వారు ఆందోళన వెల్లిబుచ్చారు. దీన్ని ఈ ఫినిషింగ్ తొలగించి రహదారిని పునరుద్ధరించాలని కోరారు. దీంతోపాటు ఈ కాలనీ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డ్రైనేజీ నీరు పొంగిపొర్లి రహదారులపై ప్రవహిస్తుందని దుర్వాసన వెలువడుతోందని వెంటనే కొత్తడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.



కాలనీలో నైట్ ప్యాట్రోలింగ్ లేకపోవడంతో అసాంఘిక శక్తులు రెచ్చి పోతున్నాయని ఈ పరిస్థితి కాలనీ ప్రజలుగా తమకు ఇబ్బందిగా పరిణమించిందని వెంటనే పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రమేష్ ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే అధికారులతో



మాట్లాడుతానని కాలనివాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, శివకుమార్, శ్రీకాంత్ పటేల్, యుగేందర్, ప్రసన్న కుమార్, నరేందర్, బాల నరసింహ, సదానందం, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

## కంటెస్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

**– శేర్లింగంపల్లి రాజకీయ వర్గాల్లో సందడి.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నర్సింగ్ యాదవ్**




**కూకట్ పల్లి, మే 17 (ప్రజా జ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రవికుమార్ యాదవ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శేర్లింగంపల్లి ప్రజల అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ నాయకులు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్, సీనియర్ నాయకులు నరసింహ చారి, ఆంజనేయులు యాదవ్, విష్ణు, చాంద్, సురేష్, రాజు, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటారని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన సేవలు మరింత అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం అభిమానుల హర్షధ్వానాలు, శుభాకాంక్షల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## ఐకమత్యతోనే అభివృద్ధి సాధ్యం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్ మే 17(ప్రజా జ్యోతి ):** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఐకమత్యంతోనే కాలనీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మిగతా ప్రాంతాలతో పాటు చెరుకుపల్లి కాలనీలో గత పన్నండేళ్ల కాలంలో ఎన్నో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, కాలనీ అభివృద్ధికి రానున్న రోజుల్లో కూడా నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.చెరుకుపల్లి కాలనీ నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి వేణు, ముఖ్య సలహాదారులు ఎం. క్రిస్ట్ దాస్, సలహాదారులు జి. లక్ష్మణ్, బి. సత్యనారాయణ రెడ్డి, యూ. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టీ. అమరేందర్, అంజన్ కుమార్ యాదవ్, కన్వీనర్లు గణేష్, ప్రదీప్ గౌడ్, సంయుక్త కార్యదర్శి వి.ఎస్.నవీన్, అబ్దుల్ మన్నర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దిలీప్ గౌడ్, సాయి కిషోర్, సభ్యులు శశికాంత్ యాదవ్, రాజేష్, తనయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఫలితమే కేకే కమిటీ-- డా. చీమ శ్రీనివాస్




**బోయిన్ పల్లి, మే 17(ప్రజా జ్యోతి):** గత తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేసిన ఉద్యమాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీని ఏర్పాటు చేసిందని ఫోరం ఫౌండర్ చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం ఫోరం 33 జిల్లాల్లో సదస్సులు, ధర్నాలు, పాదయాత్రలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ నిరంతరం పోరాటం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల కోసం 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ వంటి హామీలు చేర్పించడంలో ఫోరం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ప్రభుత్వం కేకే కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యమకారుల విజయమని తెలిపారు.నిజమైన ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ ఫలాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు

## కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరించాలి

**– కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి, మే 17 (ప్రజా జ్యోతి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శంబీపూర్ రాజు కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, గుర్తింపు ఉన్న ఓట్లను కూడా తొలగించడంతో ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవగాహన కల్పించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరించాలని, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాము. వ్యవసాయం, పారిశ్రామిక, ఐటి, శాంతిభద్రతలు అన్ని రంగాల్లో కూడా తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శమైందని.. కానీ నేడు ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయి వారి బ్రతుకులు అగమ్య గోచరమవుతున్నాయని, దేశంలో ఎక్కడా లేనటువంటి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, మిషన్ భగీరథ వంటి పథకాలు కెసిఆర్ ఆలోచనలోంచి పుట్టినవే అని అన్నారు. ఈ పథకాలనే దేశం ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతోందని, మళ్లీ కేసీఆర్ ను ముఖ్యమంత్రిని చేసుకుంటే ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ముందుకు వెళతామని పిలుపునిచ్చారు.

# మహిళల రక్షణ, కాలనీల భద్రతకు 'మీ సురక్ష' కార్యక్రమం

. సాయి పద్మజ కాలనీలో అవగాహన కల్పించిన డీసీపీ శ్యాంసుందర్






**బోయిన్ పల్లి,మే 17.(ప్రజా జ్యోతి):** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణ, కాలనీల భద్రత కోసం చేపట్టిన కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం 'మీ సురక్ష'ను బోయినపల్లి పోలీసులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇంటి పనిమనుషులు, డ్రైవర్లు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులు, అద్దెదారులు మరియు ఒంటరి వృద్ధుల వివరాలను డిజిటల్ విధానంలో సేకరించి ధృవీకరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా పోలీసులు తెలిపారు. ఆదివారం ఓల్డ్ బోయినపల్లి సాయి పద్మజ కాలనీలో బోయినపల్లి ఇన్స్పెక్టర్ తిరుపతి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ సురక్ష' అవగాహన కార్యక్రమానికి అంబర్‌పేట్ డీసీపీ శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలనీ వాసులకు 'హా ఆల్టా' యాప్ ద్వారా సిబ్బంది వివరాల నమోదు విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీసీపీ శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి సిబ్బంది వివరాలు నమోదు చేయించడం ద్వారా భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీవర్ధన్, కిరణ్ నందిత, విజయకాంత్, కాలనీ ప్రతినిధులు రంగారావు, తులసిదాస్, సోమేశ్, దేవేందర్, మల్లికార్జున్, రవిచంద్రరావు, వినీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు తరలండి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం

– ఎంఆర్పీఎస్ నాయకులు ఉప్పల్‌లో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం



**ఉప్పల్, మే 17 ప్రజా జ్యోతి :** ఉప్పల్ కేంద్రంలోని రాజీవ్ కళ్యాణ మండపంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశపాక రామ్‌చందర్ మాదిగ, జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్‌వై అశోక్ మాదిగ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు "గ్రామాలకు తరలండి" కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని విద్యార్థులను చైతన్యపరిచి సాధించిన వర్గీకరణ రిజర్వేషన్ ఫలాలు అందరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేసి మందకృష్ణ మాదిగ కార్యాచరణను విజయవంతం చేసే దిశగా మేడ్చల్ జిల్లా కమిటీ ముందుండి పనిచేస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శివ, తోకట్ట నరేష్ మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరపాక అంజి మాదిగ, మాదిగ యువసేన అధ్యక్షుడు దబిలిపురం పరశురాం, మహిళా సమైక్య అధ్యక్షురాలు సలోమి, బండారి సాయి, మైసగళ్ల శివ మాదిగ, మేడ సంజీవ్, జీడిపల్లి శివ మాదిగ, రామకృష్ణ మాదిగ, బాలకృష్ణ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు దండు శివకృష్ణ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం ఇడపాక సురేష్ మాదిగ, ఏళ్ల సంతోష్ కుమార్, వంశీ, యోగేష్, బొడ్డు శివ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్యకు ఘన సత్కారం

– మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ శుభాకాంక్షలు



**హైదరాబాద్, మే 17 (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన తెలంగాణ రాష్ట్ర షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జోగులాంబ గద్వాల్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్యను ఆదివారం ఆమె స్వగృహంలో రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సరిత తిరుపతయ్యకు శాలువాతో ఘనంగా సత్కారం చేసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ కీలక పదవుల్లో అవకాశాలు కల్పించడం అభినందనీయమని శ్రీజ్యోతి భీమ్ భరత్ పేర్కొన్నారు.

షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ ద్వారా గొర్రెలు, మేకల పెంపకదారులకు మరింత మేలు జరిగేలా సరిత తిరుపతయ్య సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో కొనుగోలులో జాప్యం.. రోడ్లపై ధాన్యం కుప్పలు

**చిగురుమామిడి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సక్రమంగా కొనుగోలు జరగకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యం కుప్పలతో నిరీక్షించాల్సి వస్తుంది. 15 రోజుల నుండి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. చిగురుమామిడి మండలంలోని ముల్కనూరు, రామంచ, గాగిరెడ్డిపల్లి, గునుకులపల్లి, ఇందుర్తి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ తదితర గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని రోడ్లపై పోసి ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కొందరు నిర్వాహకులు హమాలీలతో కుమ్మక్కై వారికి అనుకూలమైన రైతులకు ధాన్యం కోనుగోలు చేయడం జరుగుతుందని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోరాట ఫలితమే కే.కే కమిటీ: చీమ శ్రీనివాస్

– ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం తొమ్మిదేళ్లుగా నిరంతర ఉద్యమాలు



**ఉప్పల్, మే 17 ప్రజా జ్యోతి :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గత తొమ్మిదేళ్లుగా నిర్వహించిన ఉద్యమాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం కే.కే కమిటీని ఏర్పాటు చేసిందని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులను రాజకీయ పార్టీలు విస్మరించిన సమయంలో కొద్దిమంది ఉద్యమకారులతో ఫోరంను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ఐక్యం చేస్తూ చైతన్యం కల్పించామని పేర్కొన్నారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉద్యమకారులకు అందుతున్న సంక్షేమ ఫలాలు తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, ధర్నాలు, పాదయాత్రలు, పోస్టుకార్డు ఉద్యమాలు చేపట్టామని చెప్పారు. ఉద్యమకారుల సంక్షేమ అంశాలను రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని అన్ని పార్టీలను కోరినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకత్వంతో చర్చించి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ వంటి హామీలు ఎన్నికల ప్రణాళికలో చేర్చేలా కృషి చేశామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా హామీల అమలుకోసం ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగించామని చెప్పారు. హరిహర కళాభవన్‌లో నిర్వహించిన భారీ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ కమిటీ ఏర్పాటు విషయమై హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కమిటీ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

తాజాగా తార్నాకలో నిర్వహించిన సదస్సులో కూడా కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ ఫలాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణమే ఫోరం లక్ష్యమని డా. చీమ శ్రీనివాస్ తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా 33 జిల్లాల్లో మండల కమిటీలతో ఫోరం బలమైన ప్రజాసంఘంగా నిలిచిందన్నారు.

## పశువుల దొంగతనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

– సిఐ నందీశ్వర్ రెడ్డి

చింతపట్ల మాల్ మంతన్ గౌరెల్లిలో రైతులకు అవగాహన



**యాచారం, మే 17 (ప్రజాజ్యోతి):** పశువుల దొంగతనాల పట్ల పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే రైతులకు పశువుల కాపరులకు పశువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిఐ నందీశ్వర్ రెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు పశువుల దొంగతనాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మండల పరిధిలోని చింతపట్ల, మాల్, మంతన్ గౌరెల్లి గ్రామాల్లోని పశువుల కొట్టాలను రైతులను సందర్శించి పశువులను అపహరిస్తున్నారని పశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల కొట్టాలకు బందోబస్తుగా తాళాలు వేయాలని, అనుమానాస్పద అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో పశువుల కొట్టాల వద్ద కాపలా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. దొంగతనాలు జరిగితే డయల్ 100 ఆవశ్యకతను వివరించారు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా దొంగతనాలకు సంబంధించిన సంఘటనలు రైతుల దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## నీటి ట్రాన్స్‌ఫార్మర్‌తో కంపెనీకి కరెంట్..!

– నిలిపివేయాలని రామన్నగూడ వార్డు ప్రజల డిమాండ్

– ట్రాన్స్కో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక

**చేవెళ్ల, మే 17 (ప్రజా జ్యోతి):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని రామన్నగూడ వార్డులో నీటి సరఫరాకు వినియోగిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ప్రైవేట్ కంపెనీకి కరెంట్ సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ విద్యుత్ కనెక్షన్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం వార్డు ప్రజలు మక్బుల్, వెంకటేష్, శివకుమార్, నర్సింలు, మల్లేశం, పాపాయ్య, రాములు తదితరులు మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ కంపెనీలకు విద్యుత్ సరఫరా ఇవ్వాలంటే బాలనగర్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. స్థానిక ట్రాన్స్కో ఏడీ, ఏఈలకు అలాంటి అనుమతులు ఇచ్చే అధికారం లేదన్నారు. నీటి సరఫరా కోసం ఉన్న విద్యుత్ లైన్ నుంచే ప్రైవేట్ కంపెనీకి కరెంట్ ఇవ్వడంతో హై వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ట్రాన్స్కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రైవేట్ కంపెనీకి జరుగుతున్న విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వార్డు ప్రజలంతా కలిసి చేవెళ్ల ట్రాన్స్కో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## రామోజీ ఫిలిం సిటీ ప్రధాన గేటు వద్ద కుళ్ళిన స్థితిలో మృతదేహం



**అబ్దుల్లాపూర్ మెట్టు మే17 (ప్రజాజ్యోతి):** ఒక వ్యక్తి మృతదేహం కుళ్ళిన స్థితిలో అబ్దుల్లాపూర్ మెట్టు పోలీసులు గుర్తించడం జరిగింది. అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మాధవరావు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న నార్ల యాదయ్య పెట్రోలింగ్ విధుల్లో ఉన్న సమయంలో రామోజీ ఫిలిం సిటీ మెయిన్ గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కుళ్ళిపోయిన స్థితిలో కనిపించిందంటూ రామోజీ ఫిలిం సిటీ లో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డు తెలియజేయడం జరిగింది. సదరు హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని, మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు. మృతుడు బ్లూ కలర్ చెక్స్ కలిగిన షర్టు, గ్రే కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని అతని వద్ద అతనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు.

## ఆలూరులో విగ్రహావిష్కరణ సన్నాహాలు

– కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ రాక

– వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు



**చేవెళ్ల మే 17 (ప్రజా జ్యోతి):** చేవెళ్ల మండలంలోని ఆలూరు గ్రామంలో ఈనెల 30న నిర్వహించనున్న మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం చేవెళ్ల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో అంబేద్కర్ యువజన సంఘాలు సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, భీమ్ భరత్, మాజీ ఎమ్మెల్యే కేస్ రత్నం, ప్రముఖ రచయిత గోరేటి వెంకన్న తదితరులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ, మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య, సీపీఐ నాయకుడు రామస్వామి, ఆలూరు గ్రామ యూత్ అధ్యక్షుడు మహేందర్, అనంతవరాజు రమేష్, బిక్షపతి, మొకురం రాజు, మైన బెన్నీ, ప్రశాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## "బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యం

బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్




**ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన శ్రీపాద తెలంగాణ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఇష్టాగోష్టి కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు. బ్రాహ్మణుల ఆర్థిక, విద్యా, వైద్య సంక్షేమం కోసం పరిషత్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. బ్రాహ్మణుల ఆత్మగౌరవం దెబ్బతిన్న ప్రతి సందర్భంలో పరిషత్ ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీకి రూ.100 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్రాహ్మణ సమాజ అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ సహా పలువురు బ్రాహ్మణ సంఘ నాయకులు తులసి శ్రీనివాస్ జనార్ధన్ మూర్తి వక్కలంక శ్రీనివాస్ దుడ్డు సుబ్రహ్మణ్యం వారణాసి వంశీ చైతన్యపురి మాజీ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్త పప్పు వెంకట్ కక్ర మూర్తి ఆంజనేయులు పటేల్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం.. మార్కెట్‌లోనే గుండెపోటుతో రైతు మృతి

**వరంగల్:** కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి మరీ పంటలు పండిస్తే ధాన్యం కొనే నాథుడు లేక అన్నదాతలు చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వడ్ల కల్లాల్లోనే ప్రాణాలు విడుస్తున్నారు. తాజాగా వరంగల్ జిల్లానెక్కొండ మండలం అలంకానిపేట గ్రామంలో గాజుల పెద్ద వెంకటేశ్వర్లు అనే రైతు ధాన్యం మార్కెట్‌లో హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. రైతు వెంకటేశ్వర్లు వరి, మొక్కజొన్న సాగుదు చేశాడు. పంటలు చేతకొచ్చాక అమ్మేందుకు మార్కెట్‌కు తరలించాడు.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్తఫా
- పనిబంద్‌కు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ



**చేవెళ్ల, మే 17(ప్రజా జ్యోతి):** భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్తఫా డిమాండ్ చేశారు. ఆదివారం చేవెళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో పనిబంద్‌కు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి నెలకు రూ.3 వేల పెన్షన్ అందించాలని, ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించాలని, ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనం జరిగితే వెంటనే కేసులు నమోదు చేయాలని, దొంగిలించిన మెటీరియల్ స్క్రాప్‌ను దుకాణదారులు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్యూచర్ సిటీలో భవన నిర్మాణ సంఘానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, సెంట్రింగ్ కూలీని రూ.20 నుంచి రూ.30కు పెంచేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు క్రిష్ణ, జనరల్ సెక్రటరీ చంద్రమోహన్, సభ్యులు అజీంపాషా, మహేష్, వెంకటయ్య, శేఖర్, సమయ్య తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ సునీతకు జ్యోతి భీమ్ భరత్ అభినందనలు



**చేవెళ్ల మే 17(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన తెలంగాణ రాష్ట్ర షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్, జోగులాంబ గద్వాల్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీమతి సునీత తిరుపతయ్యను రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ఆమె సేవలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## జీవనాధారమైన భూములు లాక్కోవడం తగదు

- సిపిఐ (ఎం) పార్టీ గ్రామ కార్యదర్శి మడ్డి సురేష్
- ఫ్యూచర్, ఫార్మా పేరుతో భూముల స్వాధీనం ఆపాలి



**యాచారం, మే 17 (ప్రజాజ్యోతి):** ఫ్యూచర్ సిటీ, ఫార్మసిటీ పేరుతో రైతుల భూముల స్వాధీనం ఆపాలని కురుమిద్ద వార్డు సభ్యులు, సిపిఐ (ఎం) పార్టీ గ్రామ కార్యదర్శి మడ్డి సురేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. హై కోర్టు ఆర్డర్ ను అమలు చేయాలని ఫార్మసిటీ పేరుతో రైతులకు పూర్తి పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవడం తీవ్ర అన్యాయం అన్నారు. రైతుల జీవనాధారమైన భూములను బలవంతంగా లాక్కోవడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే కోర్టు ఆదేశాలను అమలు చేసి రైతులకు పూర్తి న్యాయం చేయాలని, రైతుల హక్కులను కాలరాస్తూ భూములు స్వాధీనం చేసుకోవడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ(ఎం) పార్టీ రైతుల పక్షాన, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందన్నారు.

## 304వ వారం బాబాసాహేబ్ కు ఘన నివాళి

- జ్ఞన మాల సమర్పించిన సాయిప్రసాద్







**ఉప్పల్, మే 17, ప్రజా జ్యోతి :** ఉప్పల్ జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి వారం ప్రపంచ మేదావికి మణిహారం కార్యక్రమంలో భాగంగా 304వ ఆదివారం ఉప్పల్లోని నాలెడ్జి పార్క్ లో గల బోదిసత్వ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంనకు ఉప్పల్ జై భీమ్ అసోసియేషన్ కార్యనిర్వహక కార్యదర్శి సాయిప్రసాద్ జ్ఞన పూల మాల వేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ సలహాదారులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మేడ్చల్ జిల్లా హిౖబ్రహింపట్నం డివిజన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బీ.రామయ్య , ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైద్యాధికారి డాక్టర్ సత్తయ్య, జై భీమ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఒక్కాస్ బాల నర్సింహ, అధ్యక్షులు రాపోలు రవి, ప్రధాన కార్యదర్శి మస్క దనరాజు, ఉపాధ్యక్షులు ఏసూరి బాలపొచయ్య, కార్యనిర్వహక కార్యదర్శి బొప్పెన శ్రీధర్ పాల్గొన్నారు.

## గ్రీన్ పార్క్ అవెన్యూలో 22 సీసీ కెమెరాల ప్రారంభం

- ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో కీలకం డీఐ వీరబాబు





**అల్వాల్, మే 17: (ప్రజా జ్యోతి):** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి గ్రీన్ పార్క్ అవెన్యూలో నూతనంగా ఏర్పాటు చేసిన 22 సీసీ కెమెరాలను అల్వాల్ డీఐ శ్రీ వీరబాబు, సెక్టర్ ఎస్సై దేవేందర్ కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా కాలనీ వాసులకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నేరాల నివారణతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.
సీసీ కెమెరాల పర్యవేక్షణ వల్ల కాలనీల్లో భద్రత మరింత బలోపేతం అవుతుందని, ప్రజలు పోలీసులకు సహకరించి కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కెమెరాలను ఎప్పటికప్పుడు పనిచేసే విధంగా నిర్వహించుకోవాలని నివాసితులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రీన్ పార్క్ అవెన్యూ అధ్యక్షుడు మోహన్ సీతా కుమార్, కార్యదర్శి బెజుగం వెంకటేష్, ఖజాంచి రవి రాథోడ్‌తో పాటు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

- సద్వినియోగం చేసుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు
- క్యాన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి
- టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్‌పల్లి, మే 17 (ప్రజా జ్యోతి) :** కూకట్‌పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. ప్రముఖ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, బండి రమేష్ సహకారంతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలలోని కాలనీల నుండి సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. బసవతారకం ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రోగులకు ఎంతో ఓపికగా పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. వైద్యుల సేవలను కాలనీ ప్రజలు ప్రత్యేకంగా కొనియాడారు.

**ముఖ్య అతిథుల అభినందనలు**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఇంతటి ఉత్తమ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన మాకినేని యాకనారాయణ (వినోద్)ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



ఈ హెల్త్ క్యాంప్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు అరవింద్ రెడ్డి, గంధం రాజు, చావ శ్రీనివాస్, కిలారు శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, దినేష్ కుమార్ తదితరులు పాల్గొని, శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు.
కార్యక్రమ నిర్వాహకులు మాకినేని యాకనారాయణ (వినోద్) మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ మహమ్మారి పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు పరీక్షల ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నదే మా సంకల్పం.
?ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ, అద్భుతమైన సేవలు అందించిన బసవతారకం ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అహర్నిశలు శ్రమించి ఈ క్యాంప్‌ను విజయవంతం చేసిన వాలంటీర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీస్సులు, సహకారం ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు.

## రెసోనెన్స్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

- టీజీ ఈఏపీసీఈటీ 2026 ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు







**శేరిలింగంపల్లి,మే 17 (ప్రజాజ్యోతి):** రెసోనెన్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఓ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈఏపీసీఈటీ) 2026లో అద్భుత ఫలితాలు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎం రుషి రాష్ట్ర మొదటి ర్యాంక్, వెటర్నరీ,అగ్రికల్చర్ ఓ ఫార్మసీ విభాగంలో అటిపాముల భార్గవ రాష్ట్ర 41వ ర్యాంక్ సాధించారు. అన్ని విభాగాలలో అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. మాదాపూర్ సిద్ధి వినాయక నగర్లో ఉన్న నాగ్-శేష్ కన్వెన్షన్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు నర్రా మాట్లాడుతూ ఈ పరీక్షలో విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలతో ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిరంతర శ్రమ, తల్లిదండ్రులు మాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.తెలంగాణలోని అగ్రశ్రేణి 10 ఈఏపీసీఈటీ కళాశాలల్లో మెరిట్ సీట్లకు 1250 పైగా విద్యార్థులు అర్హత సాధించారు.తెలంగాణలోని అగ్రశ్రేణి 30 ఈఏపీసీఈటీ కళాశాలల్లో మెరిట్ సీట్లకు 3250 పైగా విద్యార్థులు అర్హత సాధించారు.వెటర్నరీ, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలలో,తెలంగాణలోని అగ్రశ్రేణి 10 ఈఏపీసీఈటీ కళాశాలల్లో మెరిట్ సీట్లకు 250 పైగా విద్యార్థులు అర్హత సాధించారు.

## భగవంతుడి ఆశీస్సులు రవికుమార్ యాదవ్ పై ఉండాలని ప్రత్యేక పూజలు

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కి జన్మదిన శుభాకాంక్షలు




**శేరిలింగంపల్లి,మే 17 (ప్రజాజ్యోతి):** బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి కాంటెస్టేడ్ ఎమ్మెల్యే,ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, పై భగవంతుడి ఆశిష్యులు ఉండాలని ఉమ్మడి మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ కోరాడు. రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు మసీద్ బండ లోని బీజేపీ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మక్త మహబూబ్ పేట్ డివిజన్ నలుగురు వేదపండితులు సన్నాయి మేళాతో వెళ్ళి ప్రత్యేక ఆశీర్వాద పూజలు నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ముందు ముందు మరెన్నో ఉన్నత పశువులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాజే రావు శ్రీను, రెడ్డమ్మ,, రాము, డివిజన్ సీనియర్ నాయకులు,రవి కుమార్ యాదవ్ అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

## రహదారిలో కూలిన చెట్టు.. పోలీసుల చర్యలు

- చెట్టును తొలగించి రాకపోకల పునరుద్ధరణ





**యాచారం, మే 17 (ప్రజాజ్యోతి):** రహదారిలో ఆకస్మికంగా జరిగిన ప్రమాదాల పట్ల పోలీసులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. సాగర్ రహదారిలోని గుణగల్ వద్ద రహదారిలో ఆకస్మికంగా రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ప్రజలు వాహనదారులకు సౌకర్యానికి అంతరాయం కలుగుతుండడంతో యాచారం పోలీసులకు సమాచారం తెలియడంతో వెంటనే పెట్రోల్ మొబైల్, బ్లూఎకోల్ట్స్ పోలీసు సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారందరి సమన్వయంతో రోడ్డుపై కూలిన చెట్టును తొలగించి ట్రాఫిక్ రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు గ్రామపంచాయతీ సిబ్బంది స్పందనతో ట్రాఫిక్ సమస్యలు నివారించడం ప్రయాణికుల భద్రతకు ఏ ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసుల, గ్రామపంచాయతీ సిబ్బంది సమర్థవంతమైన వేగవంతమైన చర్యలను పలువురు కొనియాడారు.

# ఇలా అయితే అనారోగ్యం వచ్చినట్టే



వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజు మామిడి పండు. ఆ రుచికి, సువాసనకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అయితే మామిడి పండ్లను ఆస్వాదించే క్రమంలో మనం చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చాలామంది మామిడి పండు తిన్న వెంటనే దాహంగా అనిపించి నీళ్లు తాగుతుంటారు. ఇది చూడటానికి సాధారణ విషయంగా అనిపించినప్పటికీ, శరీరంలోని జీర్ణవ్యవస్థను ఇది తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం రుచి కోసం పండును ఆస్వాదించడమే కాదు, దానిని ఎలా తినాలో కూడా తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మామిడి పండ్లలో చక్కెర శాతం, పీచు పదార్థం అంటే ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరంలో జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. మనం పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల పొట్టలోని జీర్ణరసాలు పలుచబడిపోతాయి. దీనివల్ల మామిడి పండులోని పోషకాలను శరీరం గ్రహించే వేగం మందగిస్తుంది. ఫలితంగా జీర్ణ ప్రక్రియ ఆలస్యమై ఆహారం పొట్టలో అలాగే ఉండిపోయి గ్యాస్ లేదా అసౌకర్యానికి దారితీస్తుంది. అందుకే మామిడి పండు తిన్న తర్వాత కనీసం అరగంట పాటు నీటిని ముట్టుకోకపోవడమే శ్రేయస్కరం. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రధాన ఇబ్బందుల్లో కడుపు నొప్పి ఇంకా విరేచనాలు ముఖ్యమైనవి. నీరు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును అడ్డుకోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాక పొట్టలో గందరగోళం మొదలవుతుంది. ఇది వికారం లేదా కడుపులో ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. మామిడి పండులోని ఫ్రక్టోజ్ (సహజ చక్కెర) నీటితో కలిసినప్పుడు బ్యాక్టీరియా చర్య వేగవంతమై ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే మామిడి పండు తిన్న తర్వాత కనీసం ముప్పై నుండి నలభై నిమిషాల వరకు వేచి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో జీర్ణక్రియ సక్రమంగా జరిగి పండులోని విటమిన్లు ఇంకా ఖనిజాలు రక్తంలో కలుస్తాయి. ఆ తర్వాత నీళ్లు తాగడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే మామిడి పండ్లను రాత్రి పూట కంటే ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల అవి మెరుగ్గా జీర్ణమవుతాయి. పండు తినే ముందు దానిని గంట పాటు నీటిలో నానబెట్టడం వల్ల అందులోని వేడి తగ్గి చర్మానికి ఎటువంటి అలర్జీలు రాకుండా ఉంటాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన పండును ఆస్వాదించేటప్పుడు ఈ చిన్న జాగ్రత్తలు పాటించడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆహారపు అలవాట్లలో క్రమశిక్షణే మనల్ని దీర్ఘకాలిక రోగాల నుండి కాపాడుతుంది. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగే అలవాటు మీకు ఉంటే వెంటనే దానిని మార్చుకోండి. రుచితో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యం కాబట్టి నియమాలను పాటిస్తూ ఈ వేసవిని ఆనందంగా గడపండి. మన శరీరానికి ఏది అవసరమో.. ఎప్పుడు అవసరమో గుర్తించి మెలగడమే అసలైన విజ్ఞత.

# వెయిట్‌లాస్‌కు మ్యాజిక్ ఫార్ములా?



అతిగా వ్యాయామం చేయకుండానే బరువును అదుపులో ఉంచుకునే అద్భుత ఫార్ములా '30-30-30'. ఉదయం నిద్రలేచిన అరగంటలో ప్రోటీన్ తీసుకోవడం, ఆపై 30 నిమిషాల వ్యాయామంతో జీవక్రియను వేగవంతం చేసే ఈ సింపుల్ టెక్నిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. నేటి ఆధునిక జీవనశైలిలో అధిక బరువు అనేది చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య. బరువు తగ్గాలనే ఆత్రుతతో చాలా మంది క్రాష్ డైట్లు పాటించడం, అతిగా వ్యాయామాలు చేయడం లేదా సర్జరీల వైపు మొగ్గు చూపడం వంటివి చేస్తుంటారు. అయితే ఇటువంటి పద్ధతులు శరీరానికి మేలు చేయడం కంటే అనారోగ్య సమస్యలనే ఎక్కువగా తెచ్చిపెడతాయి. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని గుర్తించాలి. దీని కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఆరోగ్యకరమైన పద్ధతిలో పనిచేసే '30-30-30' రూల్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ పద్ధతి ప్రధానంగా మూడు అంశాల చుట్టూ తిరుగుతుంది. ఇది సరళంగా ఉన్నప్పటికీ జీవక్రియపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ఈ నియమం ప్రకారం.. ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. ఆ తర్వాత 30 నిమిషాల పాటు తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. చివరగా మనం తీసుకునే ఆహారంలో 30 శాతం క్యాలరీలు తగ్గించాలి. ఈ పద్ధతి కేవలం కొవ్వును కరిగించడమే కాకుండా రోజంతా ఆకలిని నియంత్రించడంలో అద్భుతంగా సాయపడుతుంది. శరీరాన్ని హింసించకుండానే క్రమపద్ధతిలో బరువు తగ్గడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఉదయం నిద్రలేచిన వెంటనే 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం వల్ల శరీర జీవక్రియ వేగవంతం అవుతుంది. పాలు, కోడిగుడ్లు, పప్పుధాన్యాలు, మొలకలు లేదా మాంసాహారం వంటి వాటిని అల్పాహారంలో భాగం చేసుకోవాలి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కడుపు నిండుగా అనిపించి ఎక్కువ సమయం ఆకలి వేయదు. దీనివల్ల మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినాలనే కోరిక తగ్గుతుంది. అల్పాహారం తీసుకున్న తర్వాత 30 నిమిషాల పాటు నడక, జాగింగ్ లేదా ఈత వంటి తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. దీనివల్ల శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు కరగడం మొదలవుతుంది. కండరాలు బలంగా తయారై శరీరం దృఢంగా మారుతుంది. బరువు తగ్గడంలో క్యాలరీల పాత్ర చాలా కీలకం. మనం ఖర్చు చేసే శక్తి కంటే ఎక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల అవి శరీరంలో కొవ్వుగా మారిపోతాయి. అందుకే రోజువారీ క్యాలరీల ఆహారంలో 30 శాతం తగ్గించి తీసుకోవాలి. దీనివల్ల శరీరం తన అవసరాల కోసం పేరుకుపోయిన పాత కొవ్వును ఇంధనంగా వాడుకుంటుంది. ఈ రూల్ పాటించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇది డయాబెటిస్ ముప్పును కూడా తగ్గిస్తుంది. ఎటువంటి ఒత్తిడి లేకుండా స్థిరంగా బరువు తగ్గాలనుకునే వారికి ఈ విధానం ఒక సంజీవనిలా పనిచేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం కలిస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఈ 30-30-30 రూల్ మనల్ని క్రమశిక్షణతో ఉంచడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వేస్తుంది. కఠినమైన డైట్లు లేకపోయినా ఫలితం నెమ్మదిగా మొదలై దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. బరువు తగ్గడమే లక్ష్యంగా పెట్టుకున్న వారు ఈ చిన్న మార్పును తమ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల అద్భుతమైన మార్పును చూడవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించి సరైన పద్ధతిలో అడుగులు వేయండి. మన శరీరాన్ని మనం గౌరవిస్తూ సంరక్షించుకోవడం కంటే మించిన సంతోషం మరొకటి ఉండదు.

# రాత్రి భోజనంలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది?



నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. చాలా కుటుంబాల్లో చపాతీ, అన్నం లేకుండా భోజనం సంపూర్ణం కాదు. చపాతీ, అన్నం తినేంత వరకు అది భోజనంలా అనిపించదు. కొందరు చపాతీని ఆరోగ్యకరమైనదిగా భావిస్తే, మరికొందరు అన్నం తేలికైనదని, సులభంగా జీర్ణమవుతుందని అనుకుంటారు. ఈ రెండు ఆహారాలలో ఏది సులభంగా జీర్ణమవుతుంది? దేనికి ఎక్కువ సమయం పడుతుంది అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి తక్కువ సమయం పడుతుంది. కానీ చపాతీ తినడం కూడా మంచిదే. నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి సాధారణంగా 1 నుండి 2 గంటల సమయం పడుతుంది. అన్నంలో అధిక మొత్తంలో పీచుపదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అన్నం శరీరంలోకి ప్రవేశించినప్పుడు త్వరగా గ్లూకోజ్‌గా మారుతుంది. అందుకే అనారోగ్యంతో లేదా బలహీనంగా ఉన్నవారికి తరచుగా అన్నం తినమని సలహా ఇస్తారు. ఇది కడుపును తేలికగా ఉంచి, తక్షణ శక్తిని అందిస్తుంది. తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. జీర్ణక్రియకు తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్ మంచిది. మరింత ప్రయోజనకరమైనది. కాబట్టి రాత్రి పూట చపాతీ బదులు బ్రౌన్ రైస్ తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. చపాతీ పగటి వేళల్లో తీసుకుంటే మంచిది.

# పండుతోపాటు గింజలను కూడా తినేస్తున్నారా?

వేసవి కాలం రాగానే అందరికీ ముందుగా గుర్తొచ్చే పండు పుచ్చకాయ. శరీరానికి కావాల్సిన నీటిని అందిస్తూ, ఉష్ణతాపం నుండి ఉపశమనం కలిగించే ఈ రసవంతమైన పండును సామాన్యుల నుండి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అయితే వేసవిలో పుచ్చకాయ తింటున్నప్పుడు గింజలను పారేస్తున్నారా? అయితే మీరు ఒక గొప్ప పోషకాహారాన్ని వృథా చేస్తున్నట్లే. పుచ్చకాయ తినేటప్పుడు చాలామంది గింజలను వేరు చేసి పారేస్తుంటారు. పోషకాల నిధి.. డైటీషియన్ రంజనా సింగ్ ప్రకారం, పుచ్చకాయ గింజల్లో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, ఐరన్ జింక్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా, కండరాల బలోపేతానికి రోగనిరోధక శక్తిని పెంచడానికి ఎంతో తోడ్పడతాయి. అయితే ఈ పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించాలంటే గింజలను నమిలి తినడం చాలా ముఖ్యం. గింజలను నమలకుండా నేరుగా మింగేయడం వల్ల వాటిలోని పూర్తి ప్రయోజనాలను మనం పొందలేము. అంతేకాకుండా, వీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. ఎలా తీసుకోవాలి? నిపుణుల సూచనలు పుచ్చకాయ గింజలను నేరుగా పండుతో పాటు నమిలి తినవచ్చు లేదా వాటిని సేకరించి ఎండబెట్టి, దోరగా వేయించుకుని చిరుతిండిగా కూడా తీసుకోవచ్చు. వేయించిన గింజలు రుచిగా ఉండటమే కాకుండా సులభంగా జీర్ణమవుతాయి. అయితే ఏ వస్తువైనా మితంగా తీసుకుంటేనే ఆరోగ్యం. పుచ్చకాయ గింజలను కూడా మోతాదుకు మించి తీసుకోకూడదు. సాధారణ ఆరోగ్యవంతులకు ఇవి ఎంతో మేలు చేసినప్పటికీ, వీటిని తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరు జాగ్రత్తగా ఉండాలి? పుచ్చకాయ గింజలు సురక్షితమైనవే అయినప్పటికీ, జీర్ణ సంబంధిత సమస్యలు అంటే గ్యాస్, ఎసిడిటీ లేదా అజీర్తితో బాధపడేవారు వీటిని అధికంగా తీసుకోకూడదు. గింజలు కడుపులో భారంగా అనిపించేలా చేసే అవకాశం ఉంది. చిన్న పిల్లలు వృద్ధులు వీటిని నమలకుండా మింగడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అలాగే కిడ్నీలో రాళ్లు లేదా మినరల్స్ అసమతుల్యత ఉన్నవారు తమ ఆహారంలో వీటిని చేర్చుకునే ముందు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తూ పుచ్చకాయ గింజలను మీ ఆహారంలో భాగం చేసుకుంటే, వేసవిలో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా శరీరానికి అవసరమైన ఖనిజాలను సహజంగానే పొందవచ్చు.



# కార్మికులు లేకున్నా జీతాలు నొక్కేసిన్రు?

**తొలగించిన వారి పేరుతో డ్రా**
**పారిశుధ్య విభాగంలో సరికొత్త దందా**
**బయోమెట్రిక్ హాజరు లేకుండానే వేతనాలు**
**చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు**
**పట్టించుకోని పాలకవర్గం**



**కరీంనగర్ :** కరీంనగర్ నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న బదిలీ కార్మికుల విషయంలో గత కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ సమయంలో 65 మంది పని చేస్తున్నట్లు గుర్తించారు. ఆ మేరకు కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువులు ఎవరు పని చేస్తున్నారో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం ఆయా కార్మికుల పేర్లను తొలగించి, బదిలీగా పని చేస్తున్న వారి పేర్లను చేర్చి పనులు కొనసాగించారు. ఈ ప్రక్రియలో 8 నుంచి 10 మంది విధులు నిర్వహించే స్థితిలో లేకపోవడం.. వారికి బదులుగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ రాకపోవడంతో వారిని విధుల నుంచి తప్పించారు. కాగా, అప్పటి నుంచి వారికి వేతనాలు అందించడం లేదు. కాగా, ఇటీవల కొత్తగా పారిశుధ్య అధికారులు ఆ పేర్లపై జీతాలను డ్రా చేసినట్టు తెలుస్తున్నది. వాస్తవానికి పారిశుధ్య కార్మికులకు బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకొని, దాని ద్వారానే జీతాలు చెల్లిస్తారు. కానీ, తొలగించిన కార్మికుల జీతాలను మాత్రం మాన్యువల్‌గానే హాజరు పరిగణలోకి తీసుకొని డ్రా చేసినట్టు సమాచారం. గతంలో కార్మికులను తొలగిస్తే.. ఇప్పుడు వారి పేరిట జీతాలు ఎలా డ్రా చేశారన్న విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి స్థానాల్లో ఎవరినైనా తీసుకొని జీతాలు ఇస్తున్నారా..?, లేక తప్పుగానే నమోదు చేసి నొక్కేస్తున్నారా..? అన్న చర్చ బల్దియాలో సాగుతున్నది. ఈ వ్యవహారంలో భారీగానే ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పారిశుధ్య విభాగంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నా అటు ఉన్నతాధికారులు గానీ, ఇటు పాలకవర్గ సభ్యులు గానీ దృష్టి సారించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆ అధికారులు తమ ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు కార్పొరేటర్లే విమర్శిస్తున్నారు. వీరిపై ఇప్పటికే ఫిర్యాదులు, ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయినా, ఎక్కడా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని వాపోతున్నారు. జిల్లా యంత్రాగం దృష్టి సారించి చర్యలు చేపడితే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

# ధాన్యం కొనరు నిర్లక్ష్యం వీడరు

**కేంద్రాల్లోనే రాశులు**
**మందడికొడిగా సేకరణ.. రైతుల పడిగాపులు**
**తాలు, తప్ప పేరిట దోపిడీ.. నిండా మునుగుతున్న వైనం**
**తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలింపులో అలసత్వం**
**సిరిసిల్ల జిల్లాలో కొనుగోళ్లు అధ్వానం**
**236 సెంటర్లలో ఇదే తీరు**
**3 లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్‌లో ఇప్పటివరకు కొన్నది 41 శాతమే**



**రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ గాడి తప్పింది. ప్రభుత్వ పట్టింపులేమి.. అధికారుల నిర్లక్ష్యంతో సేకరణ పూర్తి అధ్వానంగా.. మందకొడిగా సాగుతున్నది. పలుచోట్ల సెంట ర్లకు ధాన్యం తెచ్చి నెల గడుస్తున్నా వెనువెంటనే కొనకపో వడం, మరోవైపు తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలిం పులో జాప్యంతో కేంద్రాల్లోనే ధాన్యం మూలుగుతున్నది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు కేవలం 1,25,808 మెట్రిక్ టన్నులు కేవలం (41 శాతమే) పూర్తికావడం పరిస్థితికి అద్దంపడు తున్నది. మరోవైపు తప్ప, తాలు పేరిట అదనపు తూకం వేస్తూ దోపిడీ చేస్తుండడంతో రైతాంగం నిండా మునుగుతున్న పరిస్థితి కనిపిస్తుండగా, పట్టని ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.
జిల్లాలో యాసంగిలో లక్షా 93 వేల 330 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొత్తంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణను అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ 132, పీఏసీఎస్ 96, డీసీఎంఎస్ 1, మెప్మా 7 సెంటర్లు ఉండగా, కొనుగోళ్లు మొదలై నెల రోజులు దాటినా సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రక్రియ పూర్తిగా మందకొడిగా సాగుతున్నది. ఇప్పటి వరకు కేవలం లక్షా 25 వేల 808 మెట్రిక్ టన్నులు అంటే 41 శాతం మాత్రమే కొనుగోలు చేయడంతో సెంటర్లలోనే ధాన్యం పేరుకుపోతున్నది. ఈ నెలాఖరు వరకు ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి చేయాల్సి ఉన్నా, క్షేత్ర స్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.తెలంగాణ సమాచారం

**ఆది నుంచీ అలసత్వమే..**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మొదటి నుంచీ నిర్లక్ష్యమే కనిపిస్తున్నది. కేంద్రాలకు ధాన్యం వచ్చినా సెంటర్లు ప్రారంభించకపోవడం, ప్రారంభించిన తర్వాత వెనువెంటనే కొనకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలింపులో జాప్యం చేయడం, తూకం వేసిన బస్తాలు ఎండకు బరువు తగ్గుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు.. మండుటెండలతో నిత్యనరకం చూస్తున్నామని వాపోతున్నారు. మరోవైపు తాలు, తప్ప, తరుగు పేరిట ధాన్యంలో కోత పెడుతున్నారని మండిపడుతున్నారు. ఇక జిల్లాలోని పలు కేంద్రాల్లో లారీల కొరతతో రైతులే ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోని ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్నారు. అయితే ధాన్యం కొను గోళ్లలో నిర్లక్ష్యంపై కొద్దిరోజులుగా కోనరావుపేట, ఇల్లంత కుంట, రుద్రంగి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి పలు మండలాల్లో రైతులు ధర్నాలు, ఆందోళనలు చేస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉండడంతో ఇటీవల ముఖ్యమంత్రి సైతం కొనుగోళ్లపై సమీక్షించడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ క్రమంలో కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు దీంతో రెవెన్యూ శాఖ అధికారులు సహా పోలీస్, రవాణా విభాగం అధికారులు కేంద్రాల బాట పడుతున్న పరిస్థితి ఉంది. మరో 13 రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి వస్తాయని వాతావరణ శాఖ సూచనతో ఆందోళన చెందుతున్న రైతుల్లో పలువురు దళారులకు అమ్ముకోవడం సర్కారు నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నది.

**20 రోజులు పడిగాపులు పడ్డా**

నేను ఎకరంన్నర భూమిలో వరి వేసిన. మూడు ట్రాక్టర్ల వడ్లు పండినయి. 20 రోజుల క్రితం రగుడులోని సెంటర్‌కు తీసుకవచ్చినం. వర్షంతో ధాన్యం పూర్తిగా తడిసింది. సెంటర్‌లోనే ఆరబెట్టుకున్నా. 20 రోజులకు సీరియల్ వచ్చింది. సగం వడ్లే 30 బస్తాలే జోకిర్రు. సగం వడ్లను గడ్డి తాలు ఉందని ఆపిన్రు. మళ్లీ ఆరబెట్టాలని చెప్పిర్రు. చానా రోజులు తిప్పలు పడితే ఆఖరికి మిగిలిన వడ్లు జోకిర్రు. కానీ లారీలు లేక బస్తాలు సెంటర్లనే ఆగినయి. నిన్ననే మిల్లుకు పోయినయి.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం.. మార్కెట్‌లోనే గుండెపోటుతో రైతు మృతి



**వరంగల్:** కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి మరీ పంటలు పండిస్తే ధాన్యం కొనే నాథుడు లేక అన్నదాతలు చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వడ్ల కల్లాల్లోనే ప్రాణాలు విడుస్తున్నారు. తాజాగా వరంగల్ జిల్లానెక్కొండ మండలం అలంకానిపేట గ్రామంలో గాజుల పెద్ద వెంకటేశ్వర్లు అనే రైతు ధాన్యం మార్కెట్‌లో హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. రైతు వెంకటేశ్వర్లు వరి, మొక్కజొన్న సాగుడు చేశాడు. పంటలు చేతకొచ్చాక అమ్మేందుకు మార్కెట్‌కు తరలించాడు. మార్కెట్ ఇబ్బందుల దృష్ట్యా మొక్క జొన్నలను కాపుల కనపర్తిలో 15 రోజుల క్రితం తరలించాగా వడ్లు మాత్రం అలంకానిపేటలో మార్కెట్‌కు తరలించాడు. ఆదివారం మార్కెట్లోనే గుండెపోటుతో కుప్పకూలాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత నెల రోజుల నుంచి పండించిన పంటలు కొనుగోలు చేయకపోవడంతో ఆవేదన చెంది గుండెపోటుతో మరణించాడని కుటుంబ సభ్యులు, తోటి రైతులు ఆరోపించారు. వెంకటేశ్వర్లు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం..!



**యాదాద్రి :** నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణ దశలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యూనిట్-3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీక్ కావడమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు అంచనా వేస్తున్నారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, ప్లాంట్ ప్రాంగణమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఈ ప్రమాదంలో పంప్ ఏరియాలోని కంట్రోల్ కేబుళ్లు, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే ప్లాంట్ సిబ్బంది, అక్కడే ఉన్న అగ్నిమాపక యంత్రాలు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. దాంతో బాయిలర్లు, మెయిన్ టర్బైన్లు వంటి ప్రధాన యంత్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న తెలంగాణ జెన్‌కో ఉన్నతాధికారులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలుసుకోవడానికి అంతర్గత విచారణకు ఆదేశించారు

## చిగురుమామిడిలో కొనుగోలులో జాప్యం.. రోడ్లపై ధాన్యం కుప్పలు



**చిగురుమామిడి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సక్రమంగా కొనుగోలు జరగకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యం కుప్పలతో నిరీక్షించాల్సి వస్తుంది. 15 రోజుల నుండి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. చిగురుమామిడి మండలంలోని ముల్కనూరు, రామంచ, గాగిరెడ్డిపల్లి, గునుకులపల్లి, ఇందుర్తి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ తదితర గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని రోడ్లపై పోసి ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కొందరు నిర్వాహకులు హమాలీలతో కుమ్మక్కై వారికి అనుకూలమైన రైతులకు ధాన్యం కోనుగోలు చేయడం జరుగుతుందని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు కొనుగోలు కేంద్రాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ జిల్లా స్థాయి అధికారులను మచ్చిక చేసుకున్నాడని ఆరోపణలు వినబడుతున్నాయి.

## మహారాష్ట్రలో సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ కు అరుదైన గౌరవం

**ఆత్మీయ సత్కారం చేసిన అఖిల భారత పద్మశాలీ సంఘం, భజరంగ్ ధళ్, ఎస్‌డీవీ ఫౌండేషన్ సభ్యులు**
**ఎంత ఎదిగినా మూలలను మర్చిపోను : మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్**

**రాజన్న సిరిసిల్ల** మహారాష్ట్రలోని భీవండిలో ఇటీవలే నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ కు అరుదైన గౌరవం దక్కింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా గెలుపొందడంతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈక్రమంలో తొలిసారిగా మహారాష్ట్రలోని భీవండిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తొలిసారిగా విచ్చేసిన సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ కు అక్కడితెలంగాణ ప్రజలు, పద్మశాలీసంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు.తెలంగాణ సమాచారం అనంతరం భీవండి అఖిల పద్మశాలీ సంఘం, భజరంగ్ దళ్ సభ్యులు, ఎస్‌డీవీ ఫౌండేషన్ సభ్యులు జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ స్థాయికి ఎదిగినా మన మూలాలను మర్చిపోకూడదని, పద్మశాలీ బిడ్డ ఈ స్థాయికి రావడం సంతోషంగా ఉంది అంటూ భీవండి సమాజం కురిపించిన ఈ ప్రేమ, చేసిన సన్మానం తన జీవితంలో మరిచిపోలేనిదని పేర్కొన్నారు. భీవండి అఖిల పద్మశాలీ సంఘం, బజరంగ్ దళ్, ఎస్‌డీవీ ఫౌండేషన్ నిర్వాహకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి నమ్మకాన్ని ఎప్పటికీ నిలబెట్టుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పుట్టపర్తి రామకృష్ణ, మల్లేశం, రాజేష్, కొంక మల్లేశం, రాజేశం, గాజేంగి రాజు, గడ్డం మహేందర్,లక్ష్మీనారాయణ, దేవయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో అంగన్వాడీ టీచర్ల భర్తీ.. కరీంనగర్ జిల్లా శిశు సంక్షేమ అధికారిని సరస్వతి



**చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ల భర్తీని ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే భర్తీ చేయునున్నట్లు జిల్లా శిశు సంక్షేమ అధికారిణి మార్త సరస్వతి అన్నారు. చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లె గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో 61 అంగన్వాడీ టీచర్లు 232 ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆధారంగా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయున్నామని చెప్పారు. ముందుగా 61 అంగన్వాడీ టీచర్ల భర్తీ అనంతరం ఆయాల పోస్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. లంబాడిపల్లి లో నిరుపయోగ ఉంటున్న నిరుపయోగంగా ఉంటున్న అంగన్వాడీ కేంద్రంలో రాబోయే విద్యా సంవత్సరానికి ఇన్‌చార్జి అంగన్వాడి టీచర్లతో అంగన్వాడీ కేంద్రాన్ని నడిపిస్తున్నామని, ఇందుకు గ్రామస్తులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి పేర్కొన్నారు. వీరి వెంట సీడీపీవో శ్రీలత, సూపర్వైజర్ ఇస్రాత్ సుల్తానా, ఉప సర్పంచ్ నక్క ఓదేలు, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, అంగన్వాడీ టీచర్లు వరలక్ష్మి, అనురాధ, ధనలక్ష్మి, వార్డు సభ్యులు ఉన్నారు.

## నంది మేడారంలో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**త్వరితగతిన తూకం చేసి తరలించాలి**
**ఎప్పటికప్పుడు రైతులకు డబ్బులు చెల్లించాలని పార్టీ నాయకుల డిమాండ్**

**ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై ఆగ్రహిస్తూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో తూకం చేయకుండా పేరుకుపోయిన ధాన్యం కుప్పలను వారు పరిశీలించారు. రైతులతో ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు తమ బాధలను బీఆర్ఎస్ నాయకులతో ఏకరువు పెట్టారు. రోజుల తరబడి దాన్యం కొనుగోళ్ల కోసం తాము ఎదురు చూస్తున్నామని వివరించారు. తేమ శాతం నిర్ధారణ అయినప్పటికీ కూడా ధాన్యం తూకం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ధాన్యం నింపడానికి గోనె సంచులు ఇవ్వడం లేదని రైతుల ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మండల శాఖ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ మాట్లాడుతూ వడ్లు కొనుగోలును త్వరిగతన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ధాన్యం తడిచి రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ధాన్యం తూకంలో ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేస్తామని రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కోతను విధిస్తున్నారని శ్రీధర్ విమర్శించారు. కోతలు లేకుండా వడ్ల కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నంది మేడారం ప్యాక్స్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లయ్య, మాజీ ఎంపీటీసీ మిట్ట తిరుపతి, పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి పులి నవీన్,నాయకులు దేవి రమణ, నేరేళ్ల లచ్చన్న, పుర్ర గంగన్న, మందపల్లి శివయ్య, సాన సత్తయ్య, మిట్ట రాజయ్య, శ్రీమంతుల విజయ్, బొడ్డు నర్సయ్య,రమణవేణి మల్లేశం, మేకల బాలకుమార్, బొంతల నర్సింగం, యండి రహీం, బొంకురీ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ సంచలన నిర్ణయం..
### టోల్ టాక్స్ వసూళ్ల కోసం కొత్త చట్టం..!



ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వేదికగా అంతర్జాతీయ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల కోసం త్వరలోనే ఒక సరికొత్త వ్యవస్థను అమలు చేయనున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, జలసంధిని దాటే నౌకలపై ప్రత్యేకంగా 'టోల్ పన్ను' విధించనున్నారు. యుద్ధ నష్టాలను భర్తీ చేయడానికి, తమ సముద్ర తీర రక్షణ వ్యయాన్ని రాబట్టుకోవడానికే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు ఇబ్రహీం అజీజీ తెలిపిన వివరాల ప్రకారం.. నౌకాయానం మరింత క్రమబద్ధీకరించడానికి ఇరాన్ ఒక కొత్త ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. ఈ వ్యవస్థ ద్వారా నౌకల కోసం ప్రత్యేక నిర్దేశిత మార్గాలను సృష్టించనున్నారు. అలాగే సముద్ర మార్గంలో కల్పించే నిర్దిష్ట సేవలకు గానూ ప్రత్యేక రుసుములను వసూలు చేస్తారు. అయితే, ఈ సౌకర్యాలు మరియు మార్గాలు కేవలం వాణిజ్య నౌకలకు, ఇరాన్‌తో స్నేహపూర్వక సహకారం అందించే దేశాలకు మాత్రమే అందుబాటులో ఉంటాయని అజీజీ స్పష్టం చేశారు. దీని అర్థం, ఇరాన్ తన శత్రు లేదా ప్రత్యర్థి దేశాల నౌకలపై భవిష్యత్తులో కఠినమైన ఆంక్షలు విధించే అవకాశం ఉంది. మరోవైపు ఇరాన్ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ రెజా ఆరెఫ్ మాట్లాడుతూ, తమ శత్రు దేశాలకు చెందిన సైనిక పరికరాలను లేదా సైనిక నౌకలను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్ళడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తేల్చి చెప్పారు. ఇరాన్ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ అలీ నిక్జాద్ మరియు ఎంపీ అలీరెజా అబ్బాసి సంయుక్తంగా స్పందిస్తూ.. దేశ భద్రత, అంతర్జాతీయ చట్టాలు, పొరుగు దేశాల హక్కులను దృష్టిలో ఉంచుకునే ఈ కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. శత్రు దేశాల కోసం సైనిక పరికరాలను మోసుకెళ్లే నౌకలపై అదనపు ఆంక్షలతో పాటు భారీ జరిమానాలు, రుసుములు విధిస్తామని హెచ్చరించారు. ప్రపంచం ఇప్పుడు ఒక సరికొత్త భౌగోళిక-రాజకీయ వ్యవస్థ వైపు పయనిస్తోందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘర్ ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల మధ్య, ఇరాన్ సైనిక విభాగానికి చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ హోర్ముజ్ జలసంధికి సంబంధించిన ఒక కొత్త మ్యాప్‌ను విడుదల చేసింది. ఈ పటంలో ఇరాన్ తీరానికి అత్యంత సమీపంలో నౌకల కోసం ఒక కొత్త, సురక్షితమైన మార్గాన్ని చూపించారు. ఇది అంతర్జాతీయ నౌకాయానాన్ని తమ పూర్తి నియంత్రణలోకి తెచ్చుకునే వ్యూహంలో భాగమనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ఈ ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ త్వరలోనే శాంతి ఒప్పందానికి రాకపోతే, ఆ దేశం తీవ్రమైన ఆర్థిక, సైనిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హోర్ముజ్ సంక్షోభంపై చైనా అనుసరిస్తున్న దౌత్య వైఖరికి రష్యా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ ప్రాంతంలో శాశ్వత కాల్పుల విరమణే ఏకైక పరిష్కారమని రష్యా దౌత్యవేత్త మిఖాయిల్ ఉల్యనోవ్ పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలు, శాశ్వత కాల్పుల విరమణ ద్వారానే హోర్ముజ్ సంక్షోభాన్ని పరిష్కరించగలమని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కూడా అభిప్రాయపడ్డారు. మరోవైపు, హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ సాగిస్తున్న దాడులను, సముద్ర మార్గాల్లో మందుపాతరల అమరికను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బహ్రెయిన్, అమెరికాలు సంయుక్తంగా ఐక్యరాజ్యసమితిలో ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ పరిణామాలు గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలను మరింతగా పెంచుతున్నాయి.

# తక్కువ బడ్జెట్‌లో సొంతిల్లు..
# ఖర్చు తగ్గించే బెస్ట్ మార్గాలు!



సొంత ఇల్లు నిర్మించుకోవడం అనేది ప్రతి ఒక్కరి కల. కానీ ప్రస్తుతం.. సిమెంట్, ఇనుము, ఇసుక, కార్మిక చార్జీలు వంటి నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడంతో ఇల్లు కట్టుకోవడం చాలా ఖరీదైన వ్యవహారంగా మారింది. అయినప్పటికీ.. సరైన ప్రణాళిక, ఖర్చుపై నియంత్రణ, తెలివైన నిర్ణయాలతో తక్కువ బడ్జెట్‌లో కూడా మంచి ఇల్లు నిర్మించుకోవచ్చు. ఇప్పుడు తక్కువ డబ్బుతో ఇల్లు ఎలా కట్టుకోవచ్చో వివరంగా తెలుసుకుందాం. ఇల్లు నిర్మాణంలో మొదటి అడుగు బడ్జెట్ నిర్ణయించడం. మీ ఆదాయం, సేవింగ్స్, బ్యాంక్ లోన్ సామర్థ్యాన్ని బట్టి ఎంత వరకు ఖర్చు చేయగలమో ముందే నిర్ణయించుకోవాలి. చాలా మంది ప్లాన్ లేకుండా పనులు ప్రారంభించి మధ్యలో ఆర్థిక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే ముందుగానే.. నిర్మాణానికి సంబంధించిన పూర్తి అంచనా తయారు చేసుకోవాలి.

**చిన్న ప్లాన్‌తో ప్రారంభించడం మంచిది**

తక్కువ బడ్జెట్‌లో ఇల్లు కట్టాలంటే.. మొదట చిన్న ఇంటి డిజైన్ ఎంచుకోవడం ఉత్తమం. అవసరానికి మించి పెద్ద హాల్‌లు, ఎక్కువ బెడ్‌రూమ్‌లు, ఖరీదైన ఎలివేషన్లు పెట్టుకుంటే ఖర్చు భారీగా పెరుగుతుంది. భవిష్యత్తులో అవసరం పెరిగితే పై అంతస్తు లేదా అదనపు గదులు నిర్మించుకోవచ్చు.

**సింపుల్ డిజైన్**

ఇంటి డిజైన్ ఎంత క్లిష్టంగా ఉంటే.. నిర్మాణ వ్యయం అంత పెరుగుతుంది. కాబట్టి సాదాసీదా డిజైన్, సింపుల్ ఎలివేషన్, తక్కువ మలుపులు ఉన్న నిర్మాణం ఎంచుకోవడం మంచిది. దీని వల్ల సిమెంట్, ఇనుము, కార్మిక ఖర్చులు తగ్గుతాయి.

**నిర్మాణ సామగ్రి కొనుగోలులో జాగ్రత్త**

సిమెంట్, ఇనుము, ఇటుకలు వంటి మెటీరియల్స్‌ను ఒక్కోసారి కొనే బదులు, హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తే తక్కువ ధరలో లభిస్తాయి. అలాగే.. స్థానికంగా లభించే నాణ్యమైన మెటీరియల్స్ వాడితే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు కూడా తగ్గుతుంది. కానీ చవక కోసం నాసిరకం వస్తువులు కొనడం మాత్రం మంచిది కాదు.

**కార్మిక ఖర్చులను నియంత్రించడం**

నిర్మాణంలో లేబర్ ఖర్చు కూడా పెద్ద భాగం. కాంట్రాక్టర్‌కు పూర్తిగా అప్పగించకుండా, మెటీరియల్స్ మీరు కొనుగోలు చేసి కూలీలకు రోజువారీ చెల్లింపులతో పని చేయిస్తే కొంత వరకు ఖర్చు తగ్గుతుంది. అయితే పనిపై పర్యవేక్షణ తప్పనిసరి.

**అవసరమైన చోట మాత్రమే లగ్జరీ**

ఇంటి నిర్మాణంలో.. మార్బుల్ ఫ్లోరింగ్, ఫాల్స్ సీలింగ్, ఖరీదైన వుడ్‌వర్క్, డిజైనర్ టైల్స్ వంటి వాటికి ఎక్కువ ఖర్చు అవుతుంది. ప్రారంభ దశలో అవసరమైన వాటికే ప్రాధాన్యం ఇవ్వాలి. తరువాత ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే ఇంటిని అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు.

**ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి**

ప్రభుత్వం అందించే గృహ పథకాలు, సబ్సిడీ హోమ్ లోన్స్, ఫ్రాహీ వంటి పథకాల గురించి తెలుసుకోవాలి. అర్హత ఉంటే వీటి ద్వారా వడ్డీ భారం కొంత తగ్గుతుంది.

**ఎలక్ట్రిక్, వాటర్ ప్లానింగ్**

ఇల్లు నిర్మాణ సమయంలోనే విద్యుత్ వైరింగ్, నీటి పైపులు, డ్రైనేజ్ వ్యవస్థలను సరిగ్గా ప్లాన్ చేస్తే భవిష్యత్తులో మరమ్మతుల ఖర్చు తగ్గుతుంది. మొత్తం మీద.. తక్కువ డబ్బుతో ఇల్లు కట్టుకోవడం అసాధ్యమైన పని కాదు. అయితే సరైన ప్రణాళిక, ఖర్చుపై నియంత్రణ, అవసరాలకు తగ్గ డిజైన్, నాణ్యమైన మెటీరియల్స్ వినియోగం ద్వారా తక్కువ బడ్జెట్‌లో కూడా అందమైన, బలమైన ఇల్లు నిర్మించుకోవచ్చు. తొందరపడకుండా ప్రతి దశను ఆలోచించి ముందుకు వెళితే సొంతింటి కల సాకారం అవుతుంది.

### 20 నిమిషాల్లో ఛార్జ్.. 683 కి.మీ రేంజ్..
### మహీంద్రా ఎలక్ట్రిక్‌పై రూ.2 లక్షల డిస్కౌంట్..!




భారతీయ ఆటోమొబైల్ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మహీంద్రా సంస్థ తన సరికొత్త ఎలక్ట్రిక్ కార్లను ఎక్కువ మంది వినియోగదారులకు చేరువ చేయడానికి మే 2026లో అదిరిపోయే డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటించింది. ఈ భారీ ఆఫర్ లభిస్తున్న కార్ల జాబితాలో మహీంద్రాకు చెందిన మోస్ట్ స్టైలిష్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'మహీంద్రా బిఈ 6' ముందు వరుసలో ఉంది. కంపెనీ తన వీ2025 మోడల్స్ పై క్యాష్ డిస్కౌంట్ రూపంలో ఏకంగా రూ. 2 లక్షల వరకు బంపర్ డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. అయితే ఈ ఆఫర్ పరిమిత స్టాక్‌కు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్ 31 మే 2026 వరకు మాత్రమే వాలిడ్ అవుతుందని కంపెనీ స్పష్టం చేసింది. మరికొన్ని డీలర్‌షిప్‌ల వద్ద ఎక్స్ఛేంజ్ బోనస్ లేదా యాక్సెసరీస్ రూపంలో అదనపు బెనిఫిట్స్ కూడా పొందే అవకాశం ఉంది. కొత్తగా వచ్చే వీ2026 మోడల్స్‌పై డిస్కౌంట్లు చాలా తక్కువగా లేదా అసలు ఉండకపోవచ్చు. అందుకే కారు కొనే ముందు మీ దగ్గరలోని డీలర్‌ను సంప్రదించడం మంచిది. మిడ్-సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ సెగ్మెంట్లో స్టైలిష్ డిజైన్, పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, లాంగ్ రేంజ్‌తో వచ్చే దీజు 6 కారుకు ఈ ఆఫర్ మరింత 'వాల్యూ ఫర్ మనీ'గా మారుస్తుందనడంలో సందేహం లేదు. ఈ కారు ధర, రేంజ్, ఫీచర్ల వివరాలపై ఓ లుక్కేద్దాం..

**ధరల వివరాలు:**

మహీంద్రా దీజు 6 ఎక్స్-షోరూమ్ ధర రూ. 18.90 లక్షల నుండి ప్రారంభమై, టాప్ వేరియంట్ కోసం రూ. 28.49 లక్షల వరకు ఉంటుంది. ఆన్-రోడ్ ధర (ఢిల్లీ) సుమారు రూ. 20-30 లక్షల మధ్య ఉండవచ్చు. బ్యాటరీ, ఛార్జర్ ఆప్షన్లను బట్టి ధరలలో మార్పులు ఉంటాయి. ప్రస్తుతం వీ2025 స్టాక్‌పై లభిస్తున్న రూ. 2 లక్షల డిస్కౌంట్ వల్ల ఈ కారు మరింత తక్కువ ధరకే లభించనుంది.

# శశాంక్ పోరాటం సరిపోలే..
# పంజాబ్‌పై విజయంతో ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీ..!






డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్(ూబఅయిుఎ ఖఅఅస్త్రం)పై అదిరే విజయంతో నాకౌట్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా అవతరించింది. వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58)లు అర్ధ శతకాలతో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిలిపిన బెంగళూరు రసిక్ దార్(3-36), భువనేశ్వర్(2-38) కృషితో 23 పరుగులతో గెలిచింది. శశాంక్ సింగ్(56) ఒంటరి పోరాటం చేసినా పంజాబ్‌కు వరసగా ఆరో ఓటమి తప్పించలేకపోయాడు.

భారీ ఛేదనలో తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ ఆర్య(0)ను ఔట్ చేసిన భువనేశ్వర్(2-38).. డేంజరస్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2)ను వెనక్కి పంపి పంజాబ్‌కు షాకిచ్చాడు. ప్రభ్‌సిమ్రన్ ఆడిన బంతిని స్లిప్‌లో పడిక్కల్ రెప్పపాటులో క్యాచ్ అందుకోగా పంజాబ్ 18వద్ద రెండో వికెట్ కోల్పోయింది. కూపర్ కొన్నొల్లీ(37), కెపట్?న్ శ్రేయాస్ అయ్యర్(1)లు.. ఆదుకునే ప్రయత్నం చేయబోయారు. కానీ, రసిక్ దార్(3-36) సూపర్ డెలివరీతో అయ్యర్ వికెట్ కీపర్ జితేశ్ చేతికి దొరికాడు. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన జట్టును సూర్యాన్ష్ షెడ్గే(35)తో కలిసి గెలిపించాలనుకున్న కూపర్ నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. షెపర్డ్ ఓవర్లో పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద బెథెల్ చేతికి చిక్కాడు. కాసేపటికే షెడ్గే ఔటవ్వగా.. ఇంపాక్ట్ సబ్ స్టోయినిస్(37), శశాంక్ సింగ్(56)లు దూకుడుగా ఆడారు. సుయాశ్ ఓవర్లో శశాంక్ మూడు సిక్సర్లతో 13 ఓవర్లకు స్కోర్ 120 దాటింది. కానీ, బెంగళూరు బౌలర్లు, ఫీల్డర్లు బౌండరీలు ఇవ్వలేదు. స్టోయినిస్‌ను హేజిల్‌వుడ్ ఎల్బీగా వెనక్కి పంపి పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 33 రన్స్ అవసరమవ్వగా రెండో బంతికి శశాంక్ ఔటయ్యాడు. అంతే ఆర్సీబీ 23 పరుగుల తేడాతో గెలిచి దర్జాగా ప్లే ఆఫ్స్ దూసుకెళ్లింది.

**కోహ్లీ, అయ్యర్ అర్ధశతకాలు**

ప్లే ఆఫ్స్‌కి అడుగు దూరంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు భారీ స్కోర్ కొట్టింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ధర్మశాలలో వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58) అర్ధ శతకాలతో కదం తొక్కారు. పడిక్కల్(45)తో విరాట్ కీలక భాగస్వామ్యం నెలకొల్పగా.. ఆ తర్వాత అయ్యర్, టిమ్ డెవిడ్(28)లు ఉతికేశారు. దాంతో, పంజాబ్ ముందు కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది బెంగళూరు.




## స్పోర్ట్స్

### సాత్విక్ - చిరాగ్ జోడీకి చుక్కెదురు.. రన్నరప్‌గానే స్వదేశానికి!




థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్లో భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి కి చుక్కెదురైంది. సెమీస్‌లో సంచలన విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లిన ఈ జోడీకి లియో రాలీ కర్నాండో -- డానియెల్ మార్టిన్(ఇండోనేషియా) చెక్ పెట్టారు. ఆదివారం జరిగిన ఫైనల్లో గట్టిగా పోరాడినా భారత జంటకు ఓటమి తప్పలేదు. కెరీర్లో తొలిసారి వీరి చేతిలో సాత్విక్ చిరాగ్ జోడీ ఓటమి ఎదురైంది. థామస్ కప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం థాయ్‌లాండ్ ఓపెన్‌లో టైటిల్ చేజార్చుకుంది. ఈ సీజన్‌లో తొలి ఫైనల్లో చెలరేగుతారనుకుంటే ఉసూరుమనిపించింది. సెమీఫైనల్లో మలేషియా షట్లర్లపై అదిరే విజయంతో టైటిల్‌పై ఆశలు రేపినా చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఇండోనేషియా జోడీ లియో రాలీ కర్నాండో -- డానియెల్ మార్టిన్ ధాటికి భారత జంట చేతులెత్తేసింది. తొలి సెట్‌ను మరీ దారుణంగా 12-21తో కోల్పోయిన సాత్విక్ -- చిరాగ్ రెండో సెట్‌లో గట్టిగానే ప్రతిఘటించారు. ప్రత్యర్థితో పోటీపడి పాయింట్లు సాధించారు. కానీ, మార్టిన్ జంప్ స్మాష్‌లతో విరుచుకుపడగా రెండు పాయింట్ల తేడాతో భారత ద్వయం కంగుతిన్నది. వరస సెట్లలో విజయంతో లియో -- డానియెల్ జోడీ టైటిల్‌ను తన్నుకుపోయింది.



# ‘పెద్ది’ ట్రైలర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం.. స్పెషల్ అప్‌డేట్ ఇచ్చిన రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని సృష్టించింది. విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అంశం పెద్ది ట్రైలర్. ఈ ట్రైలర్ విడుదల కోసం సినీ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సమయంలో చిత్రబృందం మరో భారీ అప్డేట్ ఇచ్చింది. ఇప్పటికే ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన మేకర్స్, తాజాగా ఈ ఈవెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ స్వయంగా ఓ ప్రత్యేక గ్లింప్స్ ద్వారా అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. “ఇప్పటివరకు మీరు పాటలు, గ్లింప్స్ చూశారు.. ఇక ఇప్పుడు అసలు బ్లాస్ట్ చూడబోతున్నారు” అంటూ అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా రామ్ చరణ్ సందేశం ఇచ్చారు. ఈ మాటలతో సోషల్ మీడియాలో పెద్ది ట్రైలర్‌పై చర్చలు మరింత పెరిగిపోయాయి. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా ఈ గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో అభిమానులు, సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశమున్న ఈ ఈవెంట్‌పై ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి నెలకొంది. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో గ్రామీణ నేపథ్యంలో కనిపించిన చరణ్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించిన పాటలకు ఇప్పటికే మంచి స్పందన లభించింది. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రత్యేక బలంగా నిలుస్తుందని చిత్రబృందం భావిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్ విడుదలతో సినిమా అంచనాలు మరింత పెరుగుతాయా? అభిమానులు ఆశిస్తున్న స్థాయిలో ఈ ట్రైలర్ ఉండబోతుందా? అన్న ఆసక్తి ఇప్పుడు అందరిలో కనిపిస్తోంది.

# తెలుగు క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్..!

కన్నడ ముద్దుగుమ్మ, హీరోయిన్ శ్రీలీల గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు చెప్పాల్సిన పనిలేదు. ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోల సరసన మెప్పించింది. ఈ ఏడాది పరాశక్తి చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ కన్నడభామ ప్రస్తుతం ధనుష్‌కు జంటగా కనిపించనున్నారు. తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. ఈ ముద్దుగుమ్మపై గతంలో రూమర్స్ వినిపించాయి. బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో డేటింగ్‌లో ఉందంటూ వార్తలొచ్చాయి. వినాయక చవితి వేడుకల కోసం ఆమె తన తల్లితో కలిసి ముంబయిలోని కార్తీక్ ఇంటికి వెళ్లడంతో పుకార్లు వైరలయ్యాయి. అదే సమయంలో తనకు డాక్టర్ కోడలు కావాలని కార్తీక్ ఆర్యన్ తల్లి చెప్పడంతో మరింత ఆజ్యం పోసింది. కానీ వీటిపై ఎవరూ కూడా క్లారిటీ ఇవ్వలేదు.


తాజాగా శ్రీలీలపై మరోసారి డేటింగ్ రూమర్స్ సోషల్ మీడియాలో గుప్పుమంటున్నాయి. ఈ సారి ఏకంగా టీమిండియా క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందంటూ కథనాలొస్తున్నాయి. మన తెలుగువాడు, యంగ్ క్రికెటర్‌తో డేటింగ్ చేస్తోందని కథనాలు మొదలయ్యాయి. ఏడాదిగా రూమర్స్..

శ్రీలీల, తిలక్ వర్మ ప్రేమలో ఉన్నారని గతేడాది నుంచి సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి కనిపించారని వార్తలు రావడంతో రూమర్స్‌కు మరింత బలం చేకూరుతోంది. దాదాపు ఆరు నెలల క్రితమే శ్రీలీల తన తల్లితో కలిసి తిరుమలను సందర్శించింది. అదే సమయంలో తిలక్ వర్మ కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా శ్రీలీల, ఆమె తల్లితో పాటు ముంబయి ఇండియన్స్ ఆటగాళ్లతో కలిసి కనిపించడంతో రూమర్స్ మరింత బలపడుతున్నాయి. అయితే తమపై వస్తున్న వార్తలపై ఇప్పటి వరకు ఎవరు కూడా స్పందించలేదు.



# ‘త్రికాల’గా వస్తున్న శ్రద్ధాదాస్.. రిలీజ్ డేట్ ఫిక్స్!





భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ ‘త్రికాల’ మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక--శ్రీనివాస్ నిర్మించారు. చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌బి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతుంది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో ‘త్రికాల’పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన హైక్వాలిటీ వీఎఫ్ఎక్స్ ఈ సినిమాకు ప్రధాన బలం కానుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మాస్టర్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్స్‌లు, అజయ్ పవర్‌ఫుల్ పాత్ర, శ్రద్ధాదాస్ కొత్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ...“ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ ‘త్రికాల’ కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు ‘త్రికాల’ ఒక కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది” అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ... సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ‘త్రికాల’ ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది’ అని పేర్కొన్నారు.ఈ సినిమాకు హర్షవర్ధన్ రమేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

# వెంకటేశ్ -- త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్

**పాత హిట్ పాటకు రీమిక్స్ ప్లాన్!**

టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ -- త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో -- దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




# రజినీకాంత్ జైలర్ 2లో గెస్ట్ రోల్స్‌లో ఎవరెవరు కనిపించబోతున్నారంటే..?



సూపర్ స్టార్ రజినీకాంత్ క్రేజీ లైనప్‌లో ఒకటి జైలర్ సీక్వెల్ జైలర్ 2 కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. జైలర్ 2లో ముత్తువేల్ పాండ్యన్ (తలైవా పాత్ర పేరు) మరింత పవర్ ఫుల్ రోల్‌లో చూపించబోతున్నాడట. నెల్సన్ దిలీప్ కుమార్ మైండ్ బ్లోయింగ్ స్క్రీన్ ప్లే ఐడియా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనుందని ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్ పార్ట్ ముత్తువేల్ పాండ్యన్ పదవీ విరమణకు ముందు జీవితాన్ని చూపించే ప్రీక్వెల్‌గా ఉండనుండగా.. సెకండాఫ్ పూర్తి స్థాయి సీక్వెల్‌గా రానుందట. జైలర్ 2లో పాపులర్ డైరెక్టర్ కమ్ యాక్టర్ ఎస్ జే సూర్య విలన్‌గా కనిపించబోతున్నాడని సమాచారం. గెస్ట్ అప్పీరియన్స్ రోల్స్‌లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించనున్నారని టాక్. ఫస్ట్ పార్టులో విలన్‌గా కనిపించి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన వినాయకన్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నాడట. ఇక అనిరుధ్ రవిచందర్ అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మాస్ ఫీస్ట్‌లా జైలర్ 2 ఉండబోతుందన్న వార్తలు ఇప్పుడు అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాయి. తాజా టాక్ ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి జైలర్ 2 వేట మొదలు కానుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com